క్లుప్తంగా

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు

తెర్లాం: రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని సర్పంచ్ కోట సరోజిని, ఎంపీటీసీ ప్రతినిధి కొప్పల శంకరరావు అన్నారు. మండలంలోని గంగన్నపాడు లో పంచాయతీ కార్యదర్శి వినోద్ ఆధ్వర్యంలో చెత్తబుట్టలు పంపిణీ చేశారు.

వంట సామగ్రి పంపిణీ

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకానికి సంబంధించి నిర్వాహకులకు వంటపాత్రలు పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా లింగాపురం ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన ఎండీఎం నిర్వాహకులకు సర్పంచ్ బూరాడ తవిటినాయుడు శనివారం వంటపాత్రలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

- మండల ప్రత్యేకాధికారి సూర్యచంద్రరావు

బాడంగి: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి సూర్యచంద్రరావు అన్నారు. మండలంలోని తెంటువలసలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ, నవంబర్ నెలాఖరులోగా నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు హౌసింగ్ ఏఈ ఎస్.సత్యం, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటనాయుడు, ఇంజినీరింగ్ సహాయకులు, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 50 మంది దివ్యాంగ విద్యార్థులకు రామభద్రపురం మండలం బూసాయవలసకు చెందిన కేతిరెడ్డి తిరుపతి, సునంద దంపతులు విద్యాసామగ్రిని శనివారం వితరణగా అందజేశారు. తమ కుమారుడు యక్షిత్ పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం డి. సత్యనారాయణ, ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలి

బాడంగి: పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు జీతాలు సక్రమంగా చెల్లించాలని సీఐటీయూ నాయకుడు ఎ. సురేష్ అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు జీతాలు చెల్లించాలంటూ నినాదాలు చేశారు. ఈ సమయంలో కార్యాలయం లోపల సమావేశంలో ఉన్న జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, ఎంపీపీ సలహాదారు తెంటు మధు వచ్చి 15 రోజుల్లోగా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

జోరుగా ఈ క్రాప్ సామాజిక తనిఖీలు

బొబ్బిలి: పట్టణ, మండల పరిధిలోని రైతులకు సంబంధించిన ఈక్రాప్ జాబితాలను అధికారులు ఆర్బీకేలు, రామమందిరాల వద్ద ప్రదర్శిస్తున్నారు. జాబితాలో ఎటువంటి పొరపాట్లు చోటుచేసుకున్నా సవరించుకోవాలని సూచిస్తున్నారు. ఇందుకోసం ఈక్రాప్ జాబితాలపై సామాజిక తనిఖీలు చేపడుతున్నారు. పట్టణ పరిధిలోని గొల్లపల్లిలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు శనివారం సామాజిక తనిఖీలో భాగంగా జాబితా చదివి వినిపించారు. అలాగే అలజంగి, రంగరాయపురం గ్రామాల్లో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మజ్జి శ్యామ్‌సుందరరావు సభలు నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు.

ఈ–క్రాప్ వివరాలు సరిచూసుకోండి

రాజాం, రాజాం సిటీ: రైతులు ఈ–క్రాప్‌లో నమోదైన పంటల వివరాలను సరిచూసుకోవాలని, అభ్యంతరాలు ఉంటే వెంటనే ఆర్బీకే సిబ్బంది దృష్టికి తీసుకొని వెళ్లి వాటిని సరి చేయించుకోవాలని ఏఓ ఎ.రేణుకాసాయి అన్నారు. బొద్దాం, గురువాం గ్రామాల్లో ఈ–క్రాప్ నమోదుపై శనివారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. అన్ని ఆర్బీకేల్లో ఈ–క్రాప్ జాబితాలు అందుబాటులో ఉంచామని, రైతులు వాటిని పరిశీలించుకుని పేర్లు, పంట విస్తీర్ణం, ఇతర వివరాలను సరిచూసుకోవాలని కోరారు. తప్పుల సవరణకు ఈ నెల 30 వరకు అవకాశం ఉందన్నారు. స్థానిక నాయకులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

104 వాహన పార్కింగ్ కోసం వినతి

వంగర: అరసాడ పీహెచ్‌సీకి నూతనంగా మంజూరైన 104 వాహనానికి పార్కింగ్ సదుపాయం కల్పించాలని 104 వాహన ఓఈ ప్రదీప్ కోరారు. ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్.సుష్మిత దయానకు శనివారం వినతిపత్రం అందజేశారు. అరసాడ ప్రాథమిక పాఠశాల గ్రౌండ్‌లో వాహనాన్ని పార్కింగ్ చేసేందుకు అనుమతించేలా మండల విద్యాశాఖాధికారితో చర్చించాలని కోరారు. డీఈఓలు మృత్యుంజయ, రవి, కూర్మారావు ఉన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

రాజాం సిటీ: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని జెడ్పీటీసీ బండి నర్సింహులు అన్నారు. పెనుబాక గ్రామంలోని అమృత్‌సరోవర్ చెరువు గట్టుపై నాటిన కొబ్బరి మొక్కల సంరక్షణ పనులను శనివారం పర్యవేక్షించారు. ప్రతి ఒక్కరూ ఖాళీ స్థలాలు, పొలాల గట్లుపై మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు.

ప్రజారోగ్య భద్రతకు ప్రాధాన్యం



రేగిడి: తునివాడలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు



వంగర: కొండచాకరాపల్లి ఆరోగ్య సురక్ష శిబిరంలో అందిస్తున్న కంటి వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, ప్రజాప్రతినిధులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటికే ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందిస్తుండగా.. ప్రస్తుతం గ్రామస్థాయిలోనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పలు సచివాలయాల పరిధిలో శనివారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వైద్యశిబిరాలను సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను పర్యవేక్షించారు.

– సాక్షి బొబ్బిలి, రాజాం



రాజాం: గడిముడిదాంలో ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను సందర్శించిన ఎంపీపీ లావేటి సులోచన, జెడ్పీటీసీ బండి నర్సింహులు, తదితరులు



బొబ్బిలి: ఎం. బూర్జివలసలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యులతో మాట్లాడుతున్న శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీడీఓ రవికుమార్, జేసీఎస్ ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోధరరావు, తదితరులు



మెంటాడ: పోరాంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది



సంతకవిటి: తలతంపరలో జరిగిన ఆరోగ్య శిబిరం వద్ద వృద్ధుడికి మందుల కిట్లు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు
- ఎండీఎం నిర్వాహకులకు వంటపాత్రల పంపిణీ



వంట పాత్రలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కోమటిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు కొత్త వంటపాత్రలను శనివారం అందజేశారు. నాసిరకం పాత్రలతో ఇబ్బందులు పడుతున్న ఏజెన్సీలకు కొత్త దృఢమైన, నాణ్యమైన పాత్రలను రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయడం గొప్ప విషయన్నారు. ఇప్పటికే పాఠశాలల్లో అదనపు భవనాలు, కొత్త ఫర్నీచర్ ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, షూలు, యూనిఫాం పంపిణీ చేశామన్నారు. అంతకుముందు జెడ్పీ ఉన్నత పాఠశాల సమస్యలు తెలుసుకునేందుకు ఉపాధ్యాయులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. కార్యక్రమంలో బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, ఎంపీడీఓ రవికుమార్, హౌసింగ్ ఏఈ అల్లు సూర్యనారాయణ, జేసీఎస్ ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోధరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల స్థాయిని పెంచిన వ్యక్తి జగనన్న..

రామభద్రపురం: విద్యారంగంలో ఎన్నో మార్పులు తీసుకువస్తూ ప్రభుత్వ పాఠశాలల స్థాయిని పెంచిన వ్యక్తి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. ఎంపీడీఓ రమామణి, ఎంఈఓ తిరుమల ప్రసాద్‌తో కలిసి ఎండీఎం నిర్వాహకులకు వంటపాత్రలు పంపిణీ చేశారు.

సంక్షిప్తంగా...

వ్యక్తి అరెస్ట్

బొబ్బిలి: ఎస్‌ఈబీ సర్కిల్ పరిధిలోని బాడంగి మండలం పినపెంకిలో మద్యం విక్రయిస్తున్న బొనకల సత్యం అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ ఆర్. జైభీమ్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, నిందితుడి నుంచి 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మద్యం విక్రయాలపై 94409 02372 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

నవంబర్ 8న ప్రత్యేక స్పందన

తెర్లాం: వచ్చే నెల 8వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి కలెక్టర్ నాగలక్ష్మి హాజరవుతారన్నారు. వ్యక్తిగత, సామాజిక సమస్యలను స్పందన దృష్టికి తీసుకురావాలని కోరారు.

వంటపాత్రల పంపిణీ

రేగిడి: స్థానిక మండల రిసోర్సు కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఎమ్మెల్యే కంబాల జోగులు వంట పాత్రలను శనివారం పంపిణీ చేశారు. వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య, హెచ్ఎంలు పాల్గొన్నారు.

పాలిథిన్ సంచులు వినియోగిస్తే చర్యలు

రాజాం: ప్లాస్టిక్ సంచులు వినియోగించేవారిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ హెచ్చరించారు. పట్టణంలోని పలు బేకరీలు, స్వీట్ స్టాల్స్, టీస్టాల్, హోటళ్లలో శనివారం తనిఖీలు చేపట్టారు. ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించినందున వాటిని విక్రయించేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

జ్ఞాన సంపాదనతోనే మోక్షం

రేగిడి: ప్రతి ఒక్కరూ జ్ఞానాన్ని సంపాదించుకొని మోక్షాన్ని పొందాలని ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణ నాయుడు, జడ్డు జగ్గారావు అన్నారు. మండల కేంద్రంలోని దత్తపీఠంలో శనివారం జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. అనంతరం దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దత్త పాదుకా పూజ, గణపతి హోమం, ఆధ్యాత్మిక వేత్తలకు సత్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో దామోదరరావు, బాబూరావు, సంకీర్తనా నంద స్వామి, యర్రాపాత్రుని భాస్కరరావు, కుడుతుల మురళి, జల్లు శివ, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామంలో శనివారం ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. మోకాళ్ల నొప్పులు, రక్తహీనత, దగ్గు, స్త్రీలలో తెల్లబట్ట, భగందరం, జ్వరాలు తదితర వ్యాధులకు ఆయుర్వేదంలో మంచి మందులు ఉన్నాయన్నారు. ఆయుర్వేద వైద్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నవారికి ఆయుర్వేద మందులు ఉచితంగా అందజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ రామశేషు, ఏఎన్ఎం స్వాతి, ఆశావర్కర్ భారతి, లక్ష్మి, యోగా టీచర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి కొత్త వార్డుల నిర్మాణం

బొబ్బిలి: స్థానిక సీహెచ్‌సీలో కొత్త వార్డుల నిర్మాణం అంశాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టినట్టు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తెలిపారు. శనివారం స్థానిక సీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ చైర్మన్ శంబంగి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు పలు సమస్యలను ప్రస్తావించగా.. వాటి పరిష్కారానికి నిర్ణయం తీసుకున్నారు. వైద్యులు జి. శశిభూషణరావు, రెడ్డి రవికుమార్, సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో లైబ్రరీ ఉండాల్సిందే..

రాజాం: ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో లైబ్రరీ కచ్చితంగా ఉండాలని డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బ్రహ్మాజీ అన్నారు. కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. తరగతులు నిర్వహణ, టీఎల్ఎమ్ వినియోగం, లెసెన్ ప్లానింగ్ రికార్డులను పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకం నిర్వహణపై ఆరాతీశారు. పదోతరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఇప్పటినుంచే విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు.

సామాజిక తనిఖీ విజయవంతం చేయాలి



సామాజిక తనిఖీ సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ సురేష్

తెర్లాం: ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో చేపట్టిన పనులకు సంబంధించి నిర్వహించనున్న 17వ సామాజిక తనిఖీని విజయవంతం చేయాలని సామాజిక తనిఖీ రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ ఎ.సురేష్ కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అధ్యక్షతన సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన అన్ని రకాల పనులకు సంబంధించి గ్రామాల వారీగా సామాజిక తనిఖీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ, సామాజిక తనిఖీకి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. సమావేశంలో ఉపాధి ఏపీఓ సుశీల, మండల పీఆర్ జేఈ ఎ.రాజశేఖరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ పూర్తి చేయండి..

తెర్లాం: నాలుగో విడత జగనన్న విద్యాదీవెన పథకానికి సంబంధించి విద్యార్థుల ఈకేవైసీని తక్షణమే పూర్తి చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాయలంలో సంక్షేమ పథకాల డిజిటల్ రశీదులపై వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం మంజూరు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులతో డిజిటల్ రశీదులు తక్షణమే పూర్తి చేయించాలని సూచించారు. విద్యార్థుల ఈకేవైసీ త్వరగా పూర్తి చేయడంతో పాటు డిజిటల్ రశీదులను పుస్తకరూపంలో పొందుపరచాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు



మహిళలకు బుక్‌లెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

- ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని.. వీటితో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కోమటిపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ఒక్కో ఇంటికి పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో సమర్థవంతమైన పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా తోడేళ్లన్నీ కలుస్తున్నాయని ఎద్దేవా చేశారు. వారికి ఎల్లో మీడియా సహకరిస్తోందన్నారు. ప్రజలు అభివృద్ధిని చూసి ఓటేయాలని సూచించారు. జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయని చెప్పారు. ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోధరరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు వెలమల సింహాచలం, ఎంపీడీఓ రవికుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు వంగపండు శ్రీరాములు, గొట్టాపు సూర్యనారాయణ, తిరుపతిరావు, గొట్టాపు అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగన్ మామయ్య వచ్చాకే భోజనం బాగుంది..

అనంతరం గ్రామంలోని పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వడ్డించిన భోజనాలను పరిశీలించారు. పిల్లలూ..! భోజనాలు ఎలా ఉన్నాయి..? అడగగా.. చాలా బాగున్నాయి సార్! అని పిల్లలు బదులిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వచ్చాక బాగున్నాయా.. అంతకుముందు కూడా బాగున్నాయా.. అని అడిగితే వెంటనే వారు జగన్ మామయ్య వచ్చాకే బాగున్నాయి సార్! అని ముక్తకంఠంతో అనడంతో అక్కడి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు చిరునవ్వులు చిందించారు.

చంద్రబాబును కక్షతో అరెస్ట్ చేయలేదు..



మాట్లాడుతున్న జెడ్పీటీసీ పెద్దింటి, పక్కన ఎంపీపీ గౌరి

- జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి

బాడంగి: టీడీపీ అధినేతను కక్షతో అరెస్ట్ చేయలేదని.. స్కిల్ స్కామ్‌లో అవినీతి జరగడం వల్లే పోలీసులు అరెస్ట్ చేశారని జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు అన్నారు. ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి నల్ల కండువాలతో హాజరైన టీడీపీ నాయకులు చంద్రబాబు అరెస్ట్ అన్యాయమంటూ నినదిస్తూ వాకౌట్ చేశారు. ఈ సమయంలో జెడ్పీటీసీ సభ్యుడు రామారావు మాట్లాడుతూ, చంద్రబాబు అరెస్ట్‌లో వైఎస్సార్‌సీపీ పాత్ర లేదన్నారు. అనంతరం జరిగిన చర్చలో తహసీల్దార్ రఫీజాన్ భూముల రీ సర్వేపై వివరించారు. నవంబర్ ఒకటో తేదీ నుంచి బియ్యంతో పాటు పంచదార, కిలో కందిపప్పు, గోధుమపిండి అందజేస్తారని తెలిపారు. మండలంలో 46 ప్రభుత్వ పాఠశాలలకు వంటపాత్రలు పంపిణీ చేశామన్నారు. హౌసింగ్ ఏఈ సత్యం మాట్లాడుతూ, జగనన్న లే అవుట్లు, సొంత స్థలాల్లో మరుగుదొడ్లు, చోక్‌పిట్ల పనులు చురుగ్గా జరుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సూర్యచంద్రరావు, ఎంపీపీ సలహాదారు తెంటు మధుసూదనరావు, వైస్ ఎంపీపీ రమేష్, ఎంపీడీఓ అంజనేయులు, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, డాక్టర్ ఆదిత్య, గణపూరు లక్ష్మనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకోవడమే మనందరి లక్ష్యం

- ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, వేదికపై ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

వంగర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకోవడమే మనందరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ అన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల పక్షపాతిగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాభివృద్ధికి బాటలు వేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి పాలనను దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. మండలంలోని మద్దువలసలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' అనే కార్యక్రమంపై కార్యకర్తలకు శనివారం శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. నవంబర్ నెలలో నిర్వహించతలపెట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రానికి ఎంత అవసరమో వివరించాలని సూచించారు. ఈ నెల 30 నాటికి కార్యకర్తల శిక్షణ శిబిరాలు అన్ని మండలాల్లో పూర్తి చేసుకొని మండల స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, జేసీఎస్ మండల కన్వీనర్ మరిచర్ల విజయలక్ష్మి, వంగర, రేగిడి వైస్ ఎంపీపీలు కిమిడి ఉమామహేశ్వరరావు, పున్నాన సత్యనారాయణ, వావిలపల్లి జగన్మోహనరావు, తెలుగు సాహితి అకాడమీ డైరెక్టర్ బొంతు వెంకటరావు, యలకల అన్నంనాయుడు, కర్రి నారాయణరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతి,భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్



గ్రామస్తులతో మాట్లాడుతున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్

తెర్లాం: మండలంలోని సుందరాడలో శాంతి,భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్ హెచ్చరించారు. ఎస్సై ఆర్. రమేష్‌తో కలిసి శనివారం ఉదయం ఆయన గ్రామాన్ని సందర్శించారు. ఇటీవల జరిగిన దేవీ విగ్రహం నిమజ్జనం సందర్భంగా రెండు కులాల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వర్గంపై కుల దూషణ, మరో వర్గంపై పోక్సో కేసులు నమోదైన సంఘటన తెలిసిందే. ఈ మేరకు గ్రామంలో శాంతి,భద్రతలను పరిరక్షించేందుకు.. ఎటువంటి అల్లర్లు జరగకుండా ఉండేందుకు గ్రామ పెద్దలతో చర్చించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామని.. రెండు కేసులపై దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీలు రాజు, ప్రసాదరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి వితరణ



వంగర: విద్యార్థులకు స్టేషనరీ కిట్లు అందిస్తున్న హెచ్ఎం జయరాజ్

వంగర: మండలంలోని నీలయ్యవలస ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హెచ్ఎం సీహెచ్ జయరాజ్ శనివారం నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్స్, అట్టలను పంపిణీ చేశారు. తెర్లాం మండలం ఉద్దవోలుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కొల్లా సత్యకిశోర్ తన పిల్లలు పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలో ఉన్న 45 మంది విద్యార్థులకు స్టేషనరీ కిట్లు అందించినట్లు హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ శంకరరావు, పసుమర్తి గౌరీశ్వరరావు పాల్గొన్నారు.

జీఎంఆర్‌వీఎఫ్ ఆధ్వర్యంలో..

రేగిడి: మండలంలో మునకలవలస ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు శనివారం జీఎంఆర్‌వీఎఫ్ ఫౌండేషన్ నోట్‌బుక్స్ అందజేసింది. ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు చేతులమీదుగా వీటిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో జీఎంఆర్‌వీఎఫ్ ప్రతినిధులు వాసు, రాజులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటుహక్కు

- తహసీల్దార్ సులోచనారాణి



మాట్లాడుతున్న తహసీల్దార్ సులోచనారాణి

రామభద్రపురం: వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు నమోదు చేయాలని తహసీల్దార్ ఎ సులోచనరాణి అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితా ప్రదర్శించారు. అనంతరం బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వచ్చే నెల 4,5, డిసెంబర్ 2, 3 తేదీల్లో పోలింగ్ కేంద్రాల వారీగా బూత్ లెవిల్ అధికారులు ఓటర్ల నమోదుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. ఓటర్ల జాబితాతో అందుబాటులో ఉండాలన్నారు. కొత్త ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. జనవరి 5వ తేదీన తుదిజాబితా ప్రదర్శిస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై సూక్ష్మ సేద్యం పరికరాలు

రేగిడి: నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో బిందు, తుంపర సేద్యం విధానాలను అమలు చేస్తున్నామని మైక్రో ఇరిగేషన్ జిల్లా సంచాలకులు లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని మునకలవలస గ్రామంలో రైతులకు అందించిన స్ప్రింక్లర్ పైపులను శనివారం పరిశీలించారు. సూక్ష్మ సేద్యం విధానంలో భాగంగా రైతులకు 55 శాతం, 90 శాతం రాయితీపై పైపులు అందిస్తున్నామన్నారు. కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ వావిలపల్లి చంద్రశేఖరరావు, మైక్రోఇరిగేషన్ అధికారి శ్రీలత, బిజినెస్ సీఈఓ సుషేష్, వీఏఏ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేట రెవెన్యూలో గల సర్వే నంబర్లు 132–2, 3లలో ఉన్న సామూహిక మరుగుదొడ్ల స్థలం ఆక్రమణకు గురైందని స్థానికులు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్ఐ కల్యాణ చక్రవర్తి, వీఆర్ఓ, తదితరులు శనివారం ఆ స్థలాన్ని పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.